క్లుప్తంగా

చేయూత



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 12వ వార్డులో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన సముద్రాల సీత కుటుంబానికి బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో దాతల సాయంతో 50కేజీల బియ్యం, రూ.2వేల ఆర్థిక సాయం అందించినట్లు బ్లడ్ డోనర్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్ శుక్రవారం తెలిపారు. పేద కుటుంబం కోసం సహాయం కావాలని గ్రూప్‌లో పెట్టగానే వెంటనే స్పందించిన దాతలకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇట్టెం సత్యనారాయణ, పాటి ప్రశాంత్, రమానందం, కూనూరు మహేష్, మెరుగు అరుణ్, మెరుగు హరీష్, బండపల్లి సంతోష్, యరమ్రనేని సతీష్, సయ్యద్ అఫ్జల్, పెయ్యల రాకేష్, కొయ్యల సతీష్, పెండ్యాల ప్రభాకర్, వద్ది నరేష్, మెరుగు రఘు, ఖయ్యూమ్, పూనెం ప్రవీణ్, నూతి రాజేష్ పాల్గొన్నారు.

కోడిగుడ్ల పంపిణీ



ఏటూరునాగారం: మండలంలోని రాయబంధం గ్రామంలో దుగ్గి శాంతమ్మ మెమోరియల్ ట్రైబల్ స్కూల్‌లో చదువుకుంటున్న 50 మంది గిరిజన విద్యార్థులకు దుగ్గి మధురాజ్, దుగ్గి శాంతమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోడిగుడ్లను అందజేసినట్లు విద్యావలంటీర్ అఖిల్‌పాషా తెలిపారు. వేసవి కాలంలో శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు తెలిపారు.

9న మినీ మహానాడు

ఎస్ఎస్‌తాడ్వాయి: జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో ఈనెల 9న నిర్వహించనున్న టీడీపీ మినీ మహానాడుకు కార్యకర్తలను, నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నియోజక వర్గ ఇన్‌చార్జ్ ధరవత్ దేవానాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో టీడీపీకి పూర్వ వైభావాన్ని తీసుకువచ్చేందుకు మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహానాడుకు రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

పరామర్శ



ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి గ్రామానికి చెందిన ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య రోడ్డు ప్రమాదంలో ఇటీవలన గాయాపడ్డాడు. దీంతో బాధితుడిని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ పిన్నింటి మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్, విజయ్ క్రాంతి ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



ఏటూరు నాగారం: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని రామన్నగూడెంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు శ్రీరామ్ నరేష్‌కి చెందిన పాడి గేదె ఉదయం మేత కోసం విడిచి పెట్టారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న గుంతలో నీటి తాగడానికి వెళ్లిన క్రమంలో మెయిన్ లైన్ లోని న్యూటల్ వైర్ తెగి గేదెపై పడడంతో షాక్‌గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. గ్రామంలో కొత్త లైన్ల పునరుద్ధరణ పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పురుగుల మందు కలిపిన నీరు తాగి పశువులు..



కన్నాయిగూడెం: పురుగుల మందు కలిపిన నీరు తాగి ఎద్దు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని గూర్రేవులల్లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గూర్రేవులకు చెందిన ఓ రైతు పంటకు కొట్టడానికి మందు కలిపిన నీరును డ్రమ్ములో కలిపి ఉంచి కొట్టకుండా కొన్ని రోజుల తరువాత పడపోశాడు. దాహంతో వచ్చిన మూడు పశువులు ఆ నీటిని తాగి మృతి చెందాయి.

రామన్నగూడెం ముత్యాలగుడి వద్ద నవధాన్యాలను వేస్తున్న భక్తులు



ముత్యాలమ్మ గుడి వద్ద భక్తులు



శంకరాజుపల్లిలో పోతరాజుల విన్యాసాలు



బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం, శంకరాజుపల్లిలో శుక్రవారం ఉదయం బొడ్రాయి, భూలక్ష్మి, పోతరాజు, ముత్యాలమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అర్చకుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా యంత్రాలను ప్రతిష్టించి అమ్మవారి విగ్రహాలు, నాభిశిల(బొడ్రాయి)ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామంలోని భక్తులు ప్రతిష్ఠించేందుకు నిర్మించిన ప్రాంతంలో యంత్రాలను ప్రతిష్ఠించగా అందులో నవధాన్యాలు, చిల్లెర నాణాలు, కుంకుమ, పసుపు, బంగారం, వెండి, ఇతర లోహాలను వేసి మొక్కుకున్నారు.శంకరాజుపల్లిలో పోతరాజు వేషాధారణ విన్యాసాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. మూడు రోజుల పాటు చేసిన హోమం ముగిసిపోగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు ఆనంద సాయిశర్మ, బానుప్రకాష్, దయానంద, ముక్తానంద, నీరజ్, దుర్గ, నవీన్, గోవర్ధన్‌శర్మ చేపట్టారు. శంకరాజుపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమన్వయంతో వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో రామన్నగూడెం సర్పంచ్ దొడ్డ కృష్ణ, ఎగ్గడి కోటయ్య, జూపాక కృష్ణ, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, రఘు, శంకరాజుపల్లిలో సర్పంచ్ అనుముల శంకుంతల ముకుందరావు, బీఆర్ఎస్ నాయకుడు కూనూరు మహేష్, రాంబాబు, భాస్కర్ పాల్గొన్నారు.



రాంపూర్‌లో బొడ్రాయి వేడుకల్లో కంకణదారణ చేపడుతున్న వేద పండితులు

ఘనంగా కంకణదారణ వేడుకలు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా పంచాయతీ పరిధిలోని రాంపూర్‌లో చేపడుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో కంకణధారణ కార్యక్రమం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ పొలిమేరల్లో మంగళతోరణాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని మహిళా మణులు ఇత్తడి బిందెలతో భూదేవికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ వెంకట పాపిరెడ్డి మాట్లాడుతూ.. బొడ్రాయి వేడుకలు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని అన్నారు. శనివారం వేద పారాయణం, హోమం, గణపతి పూజా, వర్ష పూజ, బ్రహ్మోత్సవ బలిహారణ కార్యక్రమాలు నిర్వహిచనున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఆసక్తి కలిగిన దంపతులచే లక్ష్మీ పూజలు జరిపిస్తూ ధాన్య దినావాసం సేవ, ఫల పుష్ప ఆవాస పూజల కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శంకరాజుపల్లిలో పూజలు చేస్తున్న గోవింద్‌నాయక్

వైభవంగా నాంచారమ్మ జాతర

వెంకటాపురం(ఎం): మండలంలోని రామాంజాపూర్ గ్రామపంచాయతీ పరిధి పంటపొలాల మధ్య ఎరుకల నాంచారమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం లక్ష్మీదేవిపేట నుంచి కోలాట బృందాలు, డప్పు చప్పుళ్ల మధ్య గడపగడపకు తిరుగుతూ ఆనవాయితీ ప్రకారం దేవుడిని తీసుకు వచ్చారు. శివ సత్తుల పూనకాల మధ్య భక్తిశ్రద్ధలతో జాతర కమిటీ చైర్మన్ లోకిని రాజు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. పేద పండితులతో హోమగుండం కాల్చి నాంచారమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో జిల్లా అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి పల్లకొండ భాస్కర్, కోశాధికారి పాలకుర్తి సురేష్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పీహెచ్ఎసీ ఆధ్వర్యంలో జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నాంచారమ్మ జాతర వద్ద డాక్టర్ భవ్య మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. నాంచారమ్మను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు, జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్ఆర్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య, జిల్లా ప్రజాసంఘాల నాయకుడు ముంజాల భిక్షపతి ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

నాంచారమ్మ జాతరకు తరలివచ్చిన నాలుగు రాష్ట్రాల ఎరుకలకులస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు సర్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్ మహా అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా జాతర ప్రాంగణంలో సబ్ రిజిస్ట్రార్ చేతుల మీదుగా ఎరుకల చరిత్ర, సంస్కృతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తుమ్మేటి రాజిరెడ్డి, మాడ ప్రకాష్ , గట్టు కుమారస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు జవహర్‌లాల్, ఏఎన్ఎం స్వర్ణలత, శశికాంత ఆశ వర్కర్లు జ్యోతి, రమ, శోభ, సునీత, సరిత, కనకలక్ష్మి, సంధ్య, ఎరుకలసంఘం నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి మల్లేశం, సమ్మయ్య, రమేష్, రాష్ట్ర మహిళా నాయకులు వనం భవాని, రాణమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనేటి రాజు, కేతిరి రాజశేఖర్, జిల్లా నాయకులు ప్రమీల, దాసరి గంగయ్య, సరోజన, యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పూర్ణచందర్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న తస్లీమా

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

వాజేడు: మండల పరిధిలోని చీకుపల్లి బొగత జలపాతం వద్ద వెలసిన బోగాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12.05 గంటలకు స్వామివారి కల్యాణ వేడుకలను ఆలయ నిర్వాహకురాలు ఉయిక రాంబాయి ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రాలతో జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం హోమం చేపట్టారు.



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటి వెలుగు శిబిరంలో వైద్యసిబ్బంది

ఏటూరునాగారం: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సుమలత తెలిపారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో చేపట్టిన కంటివెలుగు శిబిరంలో శుక్రవారం 136 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అప్తాల్మిక్ ఆఫీసర్ దిలీప్, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఏఎన్ఎంలు నాగమణి, స్వరూప, డీటీపీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారులపై లాఠీచార్జ్ సిగ్గుచేటు

ఏటూరునాగారం: రెజ్లింగ్ క్రీడాకారులపై లాఠీచార్జ్ చేయడం సిగ్గుచేటని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. క్రీడాకారినిలపై లైంగికంగా వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, వావిలాల ఎల్లయ్య, ఖలీల్‌ఖాన్, సులేమాన్, గౌస్, లక్ష్మయ్య, హనుమంత్, కొప్పుల శ్రీను, చిక్కుల విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ అవంతి



మహదేవపూర్: మాట్లాడుతున్న ఎంపీపీ

మొగుళ్లపల్లి: తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సీపీడీఓ అవంతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎంపీపీ యార సుజాతసంజీవరెడ్డి అధ్యక్షతన వయో వృద్ధుల సంక్షేమం–చట్టాల అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి సునీత, సీపీడీఓ అవంతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి అధికారులు వృద్ధులతో మమేకమై వారి పోషణ జీవనశైలిపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు చట్టాలపై అవగాహన కల్పించి వృద్ధుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, సర్పంచ్ ధర్మారావు పిడిసిల్ల ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం రవి వర్మ, పంచాయతీ కార్యదర్శులు మంజుల, శ్రీనివాస్, ఎమ్ఎస్‌కే కోఆర్డినేటర్ మమత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, మాధవి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణిబాయి ఆధ్వర్యంలో వయోవృద్ధుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ రఘువరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను, వృద్ధులను వేధించిన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని పెట్టడంతో పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పారాయణం చేసేందుకు ప్రయ్నతించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకులు పాపయ్య, ఎరుకల గణపతి, నిశీధర్‌రెడ్డి, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

టేకుమట్ల: కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య ఎలాంటి అవంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండలంలోని బీజేపీ నాయకులను శుక్రవారం ముందస్తు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భజరంగ్ దళ్‌ని నిషేధిస్తామని మేనిఫెస్టోలో ఏర్పాటు చేయడం దురదుష్టమన్నారు. హిందువులను కించపరిచే విధంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడడం సరైంది కాదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు ఓటుతో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కొలుగూరి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు నాగరాజు, జిల్లా నాయకులు దావు రఘు, మహేందర్, రాజు ఉన్నారు.

చిట్యాలలో..

కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఎలాంటి గొడవలు చోటుచేసుకోకుండా బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్‌గౌడ్, గజనాల రవీందర్, తదితరులు ఉన్నారు.



భూపాలపల్లి అర్బన్: ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

గ్రామాల్లో వైద్యశిబిరాల ఏర్పాటు



మంగపేట: పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అనేష్



వాజేడు: కొంగాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

మంగపేట: మండలంలోని తిమ్మంపేటలో వైద్యాధికారి అనేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో విషజ్వరాలు వస్తుండటంతో జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. 13 మంది జ్వరపీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్స్ అమరావతి, ఏఎన్ఎం లలిత ఆశవర్కర్లు పాల్గొన్నారు.

కొంగాలలో వైద్యశిబిరం

వాజేడు: మండల పరిధిలోని కొంగాలకు చెందిన రామ్‌కుమార్(40) జ్వరంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అప్రమత్తం అయ్యారు. గ్రామంలో శుక్రవారం ఎస్‌పీబీడీసీపీ పీఓ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలపై ఇంటింటా సర్వే చేపట్టారు. వైద్యులు మహేందర్, క్రాంతి, మానసలు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మృతుడు రామ్‌కుమార్ ఇంటికి వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు.



వాజేడు: రామ్‌కుమార్ కుటుంబ సభ్యులను నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

భూపాలపల్లి అర్బన్: దళితబంధు పథకంలో లంచం తీసుకుంటున్న అవినీతి ఎమ్మెల్యేల జాబితాను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని దళిత ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టే వరకూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మందకృష్ణ ఆదేశల మేరకు ఈ నెల 10న కలెక్టరేట్ల ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న, విజయ్‌కుమార్, శ్రీనావాస్, భిక్షపతి, సురేష్, రాజేందర్, శోభన్‌బాబు, తిరుపతి, భరత్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణరెడ్డి, తిరుపతి ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగిన ప్రాంతాలను సర్వే చేసి ప్రతిపాదనలు పోయినప్పటి కీ, రైతులకు నష్టపరిహారం రాలేదని పేర్కొన్నా రు. రాష్ట్రంలో 2020 సంవత్సరం నుంచి పంటల బీమా పథకం అమలు కాకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదన్నారు. వెంటనే పంటల బీమాను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలి

మహాముత్తారం: మండల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లోని ప్రజాప్రతినిధులతో కలిసి మండలస్థాయి క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీపీ సుభద్ర అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కప్ 2023మండల స్థాయి క్రీడల నిర్వహణకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈ నెల15 నుంచి 17వరకు అథ్లెటిక్స్(రన్నింగ్, హైజంప్, లాంగ్‌జంప్) కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలు నిర్వహించాలని చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ మేరకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా చూడాలని తీర్మానించినట్లు తెలిపారు. మండలంలో పనిచేస్తున్న పీఈటీలు విజయలక్ష్మి, భారతి, భానుప్రకాష్, రాజబాపునకు క్రీడల నిర్వహణ బాధ్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు లింగమల్ల శారద ఎస్సై సుధాకర్ తదితరులు ఉన్నారు.

భూపాలపల్లి అర్బన్: సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 15నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో స్థానిక ఎంపీపీ మండల లావణ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఎంఈఓ దేవానాయక్, పీడీ రాజయ్యల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఇక్బాల్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శోభ పాల్గొన్నారు.

కాటారం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో నిర్వహించనున్న చీఫ్ మినిస్టర్ కప్ 2023 క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీడీఓ శంకర్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్రీడాపోటీల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు గల స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వ్యక్తిగతంగా, టీములవారిగా ఈ నెల 12 సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జీవాకర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్, పీడీలు రమేష్, శ్రీనివాస్, రాధ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణంలోని క్రీడా మైదానంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎస్సై కృష్ణప్రసాద్ క్రీడాస్థలాన్ని పరిశీలించారు. ఈనెల 15, 16, 17వ తేదీలలో మండల స్థాయి ఫుట్ బాల్, కబడ్డీ, 100, 200 అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.



చిట్యాల: క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బీఆర్ఎస్‌తోనే సమగ్ర అభివృద్ధి

కాటారం: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకుడు బెల్లంకొండ నర్సింగారావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శదాయకం అన్నారు. సీఎం కేసీఆర్ అమల్లోకి తీసుకొస్తున్న పథకాల వైపు దేశ ప్రజలు చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా కేసీఆర్, బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారని తెలిపారు. నూతన సచివాలయం, ఇతరాత్ర కట్టడాలతో రాష్ట్ర ఖ్యాతిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెంది ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందాలంటే బీఆర్ఎస్ మూడోవ సారి అధికారంలోకి రావాలని అన్నారు. బీఆర్ఎస్‌ను గ్రామగ్రామాన బలోపేతం చేసే దిశగా ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొమ్మిడి భూమారెడ్డి, మల్యాల రాంచంద్రగౌడ్, బొమ్మ మల్లారెడ్డి పాల్గొన్నారు.